# ఆంధ్రప్రదేశ్‌లో కార్యనిర్వాహకవ్యవస్థకు, న్యాయవ్యవస్థకు మధ్య విభేదాలు

## నిష్పాక్షికమైన న్యాయవ్యవస్థ ఆవశ్యకత

**ఆంధ్రప్రదేశ్‌లో** అధికారంలో వున్న వైఎస్సార్‌సిపికి, ప్రతిపక్షంగా ఉన్న టిడిపికి మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. రాజకీయ ఆధిపత్యం కోసం, ప్రభుత్వాధికారం కోసం పోటీపడుతున్న ఈ రెండు పార్టీలు చేస్తున్న ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కి ఉంది. వారిరువురి మధ్యనున్న వైరం ముదిరి అది రెండు ప్రధాన రాజ్యాంగ యంత్రాలైన కార్యనిర్వాహకవ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య పోరుగా మారింది. ఒక రాజ్యాంగ యంత్రం మరో రాజ్యాంగ యంత్రంపై ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవకాశం కల్పించటమే రాజ్యాంగంలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరిపై అవినీతి, అక్రమాలతో కూడిన ఆరోపణలతో, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని న్యాయమూర్తులు వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో ముఖ్యమంత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వ్రాసిన లేఖతో ఈ వైరం పరాకాష్ఠకు చేరింది.

తన లేఖలో ముఖ్యమంత్రి ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఆరోపణలు చేశారు. సదరు న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసులకు సంబంధించిన బెంచీల కేటాయింపును ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరమైన కేసుల్లో చంద్రబాబు నాయకత్వాన గత ప్రభుత్వం చేసిన అవినీతిపై జరుగుతున్న అనేక విచారణలపై స్టే ఆర్డర్లు రావటం వెనుక సదరు న్యాయమూర్తి ప్రభావం ఉందన్నది ఆయన ఆరోపణ. దీనికి ఉదాహరణగా ఆయన ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి సమీప బంధువులు, గత అడ్వకేట్ జనరల్ ఒకాయన లబ్ధిదారులుగా ఉన్న ఒక భూ వివాదానికి సంబంధించిన కేసులోని అన్ని విచారణలపై స్టే ఇవ్వటం, రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి ఇంతకుముందెన్నడూ లేని విధంగా మీడియా ఆ కేసు గురించి ఏ విధంగానూ రిపోర్టు చెయ్యకుండా 'గాగ్ ఆర్డర్' ఇవ్వటాన్ని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన తమ ప్రభుత్వాన్ని అణచివేయటానికి హైకోర్టును ఉపయోగించుకుంటున్నారన్నది ముఖ్యమంత్రి లేఖ సారాంశం.

మరోవైపు ప్రతిపక్ష టిడిపి, దాని శక్తులు, దానిని గట్టిగా సమర్థించే మీడియా శక్తులు బాధ్యతల్లో ఉన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఆరోపణలు చేస్తూ ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడాన్ని, అది కూడా ప్రధాన న్యాయమూర్తి కాబోయే వ్యక్తిపై ఆరోపణ చేయడాన్ని, ఆ లేఖను మీడియా ద్వారా బహిర్గతం చేయడాన్ని అత్యంత పవిత్రమైన రాజ్యాంగానికి విరుద్ధ చర్యగా, రాజ్యాంగం ద్వారా నెలకొల్పబడ్డ న్యాయవ్యవస్థ యొక్క స్వాతంత్ర్యంపై దాడి చేయటంగా చిత్రీకరిస్తున్నారు. న్యాయవ్యవస్థ మొత్తం పెను ప్రమాదంలో పడినట్లుగాను, న్యాయవ్యవస్థను ఆ దాడి నుండి బయటపడేసే ఉద్ధారకులుగా తమను తాము చిత్రీకరించుకుంటున్నారు. ఆరోపణల ప్రభావం రాష్ట్ర పాలనా వ్యవస్థల మీద ఏవిధంగా ఉంటుందనేది ఏమాత్రం మాట్లాడకుండా జగన్మోహన రెడ్డి విధుల్లో ఉన్న ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఆరోపణలు చేయటం నైతికంగా సరికాదనే పాట పాడుతున్నారు. ఆయన రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ లేఖ రాశాడనే విషయాన్ని దాట వేస్తున్నారు. ఈ విధమైన లేఖలను అనుమతించరాదని, అటువంటి చర్యలు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీస్తాయని కూడా వాదిస్తున్నారు. ఆరోపణలు చేయబడ్డ న్యాయమూర్తి న్యాయవ్యవస్థ ప్రజల యొక్క విశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందాలని హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో సదరు న్యాయమూర్తి తన మీద వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదనేందుకై నిష్పక్షపాత విచారణకు స్వచ్ఛందంగా ముందుకు రావటంలేదు.

ఇటీవలికాలంలో కోర్టుల, న్యాయవ్యవస్థల నిష్పాక్షికతపై నమ్మకం సన్నగిల్లేలా అనేక కీలకమైన కేసుల్లో కోర్టు తీర్పులు వెలువడ్డాయి. ముఖ్యంగా ఈ మధ్యనే బాబ్రీ మసీదు కూల్చివేతపై ఆరోపణలు ఎదుర్కొన్న వారందర్నీ నిర్దోషులుగా ప్రకటిస్తూ వెలువడ్డ తీర్పు, కోర్టు ధిక్కారం మోపుతూ ప్రశాంత్ భూషణ్ మీద ఆరోపించబడ్డ కేసు న్యాయవ్యవస్థలపైనా, తీర్పులపైనా విశ్వాసం సన్నగిల్లేలా ఉన్నాయనటానికి ఉదాహరణలుగా ఉన్నాయి. న్యాయ వ్యవస్థ పట్ల, జడ్జిల పట్ల అపరిమితమయిన విశ్వాసం గాని, నమ్మకంగాని కలిగి ఉండరాదని పై తీర్పులు ప్రజలను హెచ్చరిస్తున్నాయి. వివిధ కేసుల సందర్భంగా చట్టాలు అందరికీ ఒకే విధంగా ఎలా వర్తింపచేయబడటం లేదో, ఎలా న్యాయవ్యవస్థలకు జవాబుదారీతనం లేకుండా పోతోందో ప్రజలు పరిశీలిస్తున్నారు, గ్రహిస్తున్నారు. ఘోరమైన నేరాలు చేసినవారు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ మద్దతుతో నిర్దోషులుగా బయటపడి, తమ మీద అక్రమ కేసులు పెట్టబడినట్లుగా ఎలా ప్రచారం గావించుకుంటున్నారో ఎలా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. డా॥ వినాయక్‌సేన్, వరవరరావు, స్టాన్‌స్వామి వంటి భీమాకోరేగావ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నవాళ్ళు, వయో భారంతో ఉన్నా, ప్రొ॥సాయిబాబా వంటి వారు అంగవైకల్యం, అనారోగ్యాలతో కదలలేని స్థితిలో ఉన్నా కోర్టులు, జడ్జీలు వాళ్ళకు బెయిల్ నిరాకరించటం చట్టాలు సమానంగా వర్తించ వనటానికి, దుర్వినియోగమవుతున్నాయనటానికి నిదర్శనం. మన న్యాయవ్యవస్థ నిష్పాక్షికమైనదనే నమ్మకాన్ని ఏ విధంగానూ పైన పేర్కొన్న ఘటనలు కలిగించలేవు.

సాధారణ ప్రజానీకానికి సంబంధించిన కేసులు, పెట్టుబడిదారీ యాజమాన్యాల వల్ల అన్యాయాలకు గురైన బాధిత కార్మికుల కేసులుగానీ, గ్రామీణ ప్రాంతాల్లో ధనిక పెత్తందార్ల ఫ్యూడల్ దోపిడికి గురవుతున్న పేద ప్రజానీకానికి సంబంధించిన కేసులుగానీ కోర్టులలో ఏళ్ళ తరబడి విచారణకే రాకుండా పోవటంతో నేరస్తులు నిర్భయంగా తిరుగుతున్నారు. కోర్టు విచారణలో అసాధారణ జాప్యం, తీర్పులు వెలువరించటంలో జాప్యం, కోర్టుకేసుల నెదుర్కోవాలంటే తప్పనిసరైన మోయలేని ఆర్థిక భారాలు ఇవన్నీ కోర్టులపట్ల, న్యాయవ్యవస్థ పట్ల మెజారిటీగా ఉన్న సాధారణ ప్రజానీకంలో విశ్వాసం కోల్పోయేటట్లు చేశాయి. మనదేశంలో న్యాయం అన్నది ధనవంతులకు, బలవంతులకు మాత్రమే కల్పించబడే ప్రత్యేక సౌకర్యం, హక్కు మాత్రమేనని – ప్రజలకు వారి అనుభవం నుండి అర్థమౌతున్నది. రాజ్యాంగం కల్పించినట్లుగా చెప్పబడే సమన్యాయం అన్నది లేనేలేదనేది కూడా వారికి స్పష్టమౌతున్నది.

ప్రస్తుతం అనేకమంది న్యాయవ్యవస్థ యొక్క స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు. ఉల్లంఘించరాని స్వతంత్ర ప్రతిపత్తిని రాజ్యాంగం న్యాయవ్యవస్థకు కల్పించిందనే ధోరణి వ్యక్తమౌతున్నది. కానీ రాజ్యాంగంలో ఎక్కడా కూడా వ్యక్తంగా గానీ, అవ్యక్తంగా గానీ న్యాయవ్యవస్థ యొక్క, న్యాయమూర్తుల యొక్క స్వతంత్రత గురించి పేర్కొనలేదు. ఆర్టికల్ 50 సాధారణంగా చెప్పేదేమంటే 'ప్రజాపాలనలో న్యాయవ్యవస్థను, కార్యనిర్వాహక వ్యవస్థను వేర్వేరుగా రాజ్యం ఉంచాలని'. కానీ 73 సంవత్సరాల 'స్వతంత్ర' భారతదేశంలో న్యాయవ్యవస్థ చాలామంది మాట్లాడుకుంటున్నట్లు తానిచ్చిన తీర్పులనే ప్రామాణికంగా చేసుకుని ప్రస్తుతం చాలామంది మాట్లాడుతున్న విధంగా స్వతంత్ర, అత్యున్నత వ్యవస్థగా రూపొందింది.

ఎటువంటి భయాలు లేకుండా, బెదిరింపులకు లొంగకుండా, ఎవరికో మేలు చేసే విధంగా కాకుండా నిష్పాక్షికమైన, న్యాయబద్ధమైన తీర్పులు

న్యాయవ్యవస్థ ద్వారా వస్తాయనీ, దాని నిజాయితీ, నిబద్ధత, సదుద్దేశాల గురించి ఎంత భక్తి ప్రపత్తులతో మాట్లాడుకుంటున్నప్పటికీ ఈ 73 సం॥లలో అది సేవ చేసింది అధికారంలో ఉన్నవారికి, సామాజికంగా, ఆర్థికంగా బలవంతులైనవారికి మాత్రమే. కానీ ఇవేవీ కూడా ప్రజలకన్నా, ప్రజా ఆకాంక్షల కన్నా మిన్నగా అత్యంత అధికార శక్తిని న్యాయవ్యవస్థకు కట్టబెట్టలేవు. హేతుబద్ధమైన విమర్శలకు, జవాబుదారీతనానికి అతీతంగా న్యాయ మూర్తులను నిలబెట్టలేవు.

న్యాయమూర్తులు కూడా సమాజంలో, ప్రజల్లో భాగమే. వారేమీ ఆకాశం నుండి ఊడిపడిన వారు కాదు. సహజ మానవ స్వభావాలకు, ఉద్వేగాలకు, తామున్న సామాజిక భౌతిక పరిస్థితుల నుండి ఉత్పన్నమయ్యే భావాలకు, పక్షపాతాలకు అతీతంగా న్యాయమూర్తులుగానీ, తీర్పులుగానీ ఉండవు. కనుక వారేమీ వివిధ ప్రలోభాలకు లోబడరని అనుకోలేము. వాళ్ళకూ రాజకీయ అభిప్రాయాలు, పక్షపాత ధోరణులు, స్వంత అభిప్రాయాలు, విధేయతలు ఉండి తీరతాయి. వారి కార్యకలాపాలను కూడా పరిశీలించవలసిందే, నియంత్రించవలసిందే, ముఖ్యంగా ప్రస్తుతం వచ్చినటువంటి ఆరోపణలు వచ్చిన సందర్భాలలోనైనా. నిజమైన ప్రజా స్వామ్యాన్ని, దేశంలో ప్రజాస్వామిక పాలనను నెలకొల్పాలంటే జడ్జిలను కూడా సాధారణ ప్రజల్లాగానే పరిగణించాలి. తమ అవినీతి, అక్రమ తీర్పులకు వారు బాధ్యత వహించాలి. దానికి వారిని అతీతులను చేయటం న్యాయసమ్మతం కాదు.

ఇతర రాజ్యాంగ వ్యవస్థలపై కోర్టులు అడపాదడపా చేసే వ్యాఖ్యలు, అప్పుడప్పుడు బాధ్యతారహితంగా వాటిని అవహేళన చేయటం నిజాయితీతో కూడిన న్యాయానికి ప్రత్యామ్నాయం కాజాలదు. నిష్పాక్షికమైన న్యాయానికి ఎంతో దూరాన ఉన్న ప్రజలకు అది ఏమాత్రం ఊరటనివ్వదు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన తీవ్ర ఆరోపణలు సంబంధిత సుప్రీంకోర్టు న్యాయమూర్తి యొక్క వృత్తిపరమైన, వ్యక్తిగతమైన నిజాయితీని, నైతిక విలువలను ప్రశ్నిస్తున్నాయి. ఆ ఆరోపణలు నిజమైన పక్షంలో వాటిని పూర్తిగా తిరస్కరించటం ద్వారాగానీ, తమను తాము సమర్థించుకోవటం ద్వారాగానీ అవినీతి, అక్రమాల నుండి న్యాయవ్యవస్థను కాపాడలేరు. వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షికమైన లోతైన విచారణ మాత్రమే నిజాలను నిగ్గుతేల్చగలదు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంపొందింప జేయగలదు. అటువంటి విచారణను ఏ పేరుతో అడ్డుకున్నప్పటికీ అది న్యాయవ్యవస్థకు, కార్యనిర్వాహకవ్యవస్థకు మధ్య వైరాన్ని మరింత పెంచేందుకు దోహద పడుతుంది. ప్రజల ప్రయోజనాలకు హానికరంగా పరిణమిస్తుంది. దీనిని వైఎస్సార్‌సిపి, టిడిపిల మధ్య రాజకీయ ఆధిపత్యం కోసం జరిగే పోరుగా సంకుచితంగా చూడరాదు. విజ్ఞత పైచేయి సాధిస్తుందని ఆశిద్దాం.

★ ★ ★